

# బ్రతుకు దెరువు

శ్రీ రామారావు

ఉదయం షికారుకి బయల్దేరాను, స్నానసామగ్రి సంచిలో సర్దుకొని. మంచు మహాదట్టంగా వుంది. మనిషీ మనిషీ కనిపించడంలేదు. గుట్టలు, గోతులు, చెట్లు, చామలు అన్నీ ఒకలాగే కనిపిస్తున్నాయి, ఆ పొగ మంచులో. మంచుతో నా కాళ్ళు నీళ్ళతో కడిగినట్టు అయిపోయాయి. చిన్న చిన్న ఆకులూ, గడ్డి పరకలూ చలికి ఆగలేక నా కాళ్ళని కావలించుకున్నాయి. పచ్చికతో నిండివున్న బీళ్లంటబడి నడుస్తున్నాను. నా కాలి వేళ్ళు వంకర్లు పోతూన్నాయి. నరనరాన్నీ చలి పలకరించి పట్టుకుని మరీ పీక్కుతింటూంది. పాపం కాశ్మీర శాలువా యెంత సాహాయపడితే మాత్రం ఏం ప్రయోజనం? సిగరెట్ కాలిస్తే కాస్త వుషార్ కలుగుతుందని జేబు తడిమితే అగ్గిపెట్టె కనిపించలేదు! యిక చూడండి నా అవస్థ! యేం జేయడానికి పాలిపోయి దికాదు. సరే అగ్రహారంలో కాల్చుకుందామని, అడుగులు కొంచం జోరుగా వేస్తే చలి అయినా తగ్గుతుందని నడక చురుకు చేశాను. అగ్రహారంలో యెక్కడా మనిషి సంచారమే కనిపించలేదు. నిశ్శబ్దం వీధుల్లో తాండవమాడుతోంది. వొక్క పేద ముసలమ్మ మాత్రం మామ్మూలుగా కనిపించింది. అలాగే నే వీధినిబడి నడుస్తున్నాను. కొంచం దూరంలో అరుగుమీద లాంతరు కనిపించింది. నా ప్రాణం లేచివొచ్చింది. కొంచం చురుగ్గా దగ్గరకి వెళ్లేసరికి మెట్లముందు బాగా అలికి ముగ్గుపెడుతూ కూచుందో స్త్రీ) ఆమె చిత్రకళాధ్యానంలో పడి యీ ప్రపంచాన్నే మర్చిపోయిందా అనిపించింది. ఆమె తెల్లనిచేతిలో ఆ సున్నం యెంత నైపుణ్యంగా, మెలికలుగా తిరుగుతూందంటారు? యిట్లా యీ పల్లెలోపడి మగ్గి జీర్ణించి పోతూన్నా యీకళల్ని చూచి ఆనందించి, ప్రోత్సాహించే దెవరు!

ఆమె చూడకుండా లాంతరుతీస్తే ఆమె బెదిరి యే దొంగో అని కేకలెడితే అనవసరంగా అల్లరవుతుంది. మరి నే సిగరెట్ కాల్చుకునేదేలా? ఆమెకు వినిపించేలా దగ్గాను. ఆమె నాకేసి యెగాదిగా కంగారు పడుతూ చూచి "ఎవరు?" అని మళ్లా వెంటనే "యెందుకొచ్చావ్" అంది. మొదటి ప్రశ్నకి సమాధానం చెప్పాల్సి పెదవులు సవరించేలోగా రెండో ప్రశ్న వేసింది. మొదటి ప్రశ్నకి సమాధానం చెప్పేకంటే రెండో ప్రశ్నకి సమాధానం యివ్వడమే మంచిదనితోచి "సిగరెట్ కాల్చుకోవాలని లాంతరుకోసం" ఆమె యేమీ మాట్లాడలేదు. పైటమాత్రం సర్దుకుని తన పనిచూచుకుంటోంది. నేను సిగరెట్టే కాల్చుకోనా ఆ చిత్రకళనే చూడనా లేక మొగలిపూవులాంటి ఆ స్త్రీనే చూడనా? యేలాగో సిగరెట్ కాల్చుకుని ఆమెని విడువలేక విడువలేక నదివేపుకి మళ్లాను.

★

మామ్మూలుగా వేపచెట్టుకి సంచి తగిలించి, తువ్వాలు కట్టుకుని నదిలోకి వురికాను. యిసురుగా వొస్తున్నా ఆ నీటిలో, కులాసాగా, చలిపోయేలా

యీదుతున్నా. ప్రభాతమైంది. యెర్రని నీరు యెండ తురాయి మొక్కమీదా, నా నంచి తగిలించిన చెట్టు మీదా పడింది. మంచు తెరలు కొంచంకొంచం చెదిరి పోతూన్నాయి. తురాయి చెట్టుమీద కోయిల మధురంగా ప్రభాతగీతం పాడుతూంది. నేను ఆ పాటలోవున్న స్వతంత్ర భావానికి నాలో నేనే వుప్పొంగిపోతూ, జలజలపారే ఆ నీళ్ళలో వాడలు తెలియకుండా యీదుతున్నాను. కొంచం దూరంలో స్త్రీ నీటిలోకి దిగడం చూచాను. నేను వొడ్డెక్కేసరికి ఆమె మళ్లీ కనిపించలేదు. నేను గట్టెక్కి గబగబా పరుగెత్తు కెళ్లాను. బిందె వొడ్డున నీట్లో తేలుతోంది ఆమె నీట్లో జారిపడినట్టు తోచింది. దప్పున నదిలోకి వురికాను. నాల్గు గజాల లోతుకి వెళ్ళేసరికి ఆమె నా కుడికాలుకి తగిలింది. నా రెండుచేతులమీదా వేసుకుని గట్టుమీదకి తీసుకొచ్చాను. ఆమెకి యింకా తెలివి రాలేదు. ఆమెకి వేడి యెక్కడం అవసరం యెలా? ఆమె చొక్కా బాడీవిప్పేశాను. తువ్వాలుతో శరీరాన్నంతా తుడిచేసి నాకాశ్మీరశాలువా గట్టిగా చుట్టబెట్టి, నావొళ్లో బుర్రబెట్టుకుని కూచున్నాను. ఆమె యిందాకటి చిత్రకారిణే! ఆ లేత ముఖంలో వున్న ప్రశాంతాన్ని చూస్తూ, ఆ నున్నని, యెర్రని చెక్కిల్ని చేత్తో నిమురుతూన్నాను. సూర్యుడికి కూడా ఆమె అందచందాలను చూడాలని మనసు కలిగినట్టుంది. రెండు బారలు పైకొచ్చి, వేప చెట్టు ఆకుల్లోంచి, నిక్కినిక్కి ఆమె ముఖాన్ని చూస్తూన్నాడు. ఆమె కదిలింది, ఆయాసపడింది, వొక్కమారే వుబ్బెత్తుగా లేవాలని ప్రయత్నించింది. కానీ, ఆమె చేతులు, శరీరం అంతా నాకాష్మీర శాలువా అధీనంలో వుండిపోవడం మూలాన ఆమె అలాగే నావొడిలోవుండే "పాపం! ...కాపాడేరు..." అంది ఆమె యిందాకటి రెండు ప్రశ్నలూ కోటలో, పంజరంలో వున్నా మైన గోర పలుకుల్లావున్నాయి. యిప్పుడో, ప్రేమతో, వాత్సల్యంతో, యీ నది ప్రవహిస్తున్నట్టే వున్నది. ఆమె లేచి కూచోడానికి ప్రయత్నిస్తుంటే ఆమె కళ్లమీద శాలువా ముసుగు సడలింపచేసాను. ఆమె లేచి కూచుంది. నేను ఆమెచీర, బాడీతీసి నదిలో గిలకరించి, పిండి చెట్టుమీద ఆరేశాను. నా స్నానం కూడా పూర్తిచేసుకుని ఆమె సామీప్యానికి వొచ్చి నిలబడ్డాను. ఆమె మృదువైన పెదవుల్లోంచి మధురసం వెలుపడింది. అట్లా ఆకళామూర్తిని చూస్తు, నాసర్వేంద్రియాల్ని గుర్రపుజీనులా పట్టుకుని నిలబడ్డాను. ఆమె శాలువా సర్దుకుంటూ లేచి నిలబడింది. నేను నా సంచి తెచ్చుకుని సామానంతా సర్దుకుంటున్నాను. ఆరుతోన్న చీర బాడీ తెచ్చేసుకుని కట్టేసుకుని శాలువా నా భుజంమీద పడేసింది. ఆ శాలువ వేసుకుని ఆమెకి కనిపించకుండా మనసారా ముద్దుపెట్టుకున్నా. ఆమె నీళ్లు ముంచుకుని బిందె చంక పెట్టుకుని వొయ్యారంగా వేప చెట్టుక్రింద నిలబడింది. ఆమెనిచూచి పక్షులు కిలకిలలాడుతూ ఆ కొమ్మమీదనుండి యీ కొమ్మమీదకి వురుకుతూన్నాయి. నేనే చిత్రకారుణ్ణైతే ఆ దృశ్యాన్ని యెంత చక్కనిబొమ్మగీద్దును! నల్లని ఆమె తలవెంట్రుకలు పాయలుగా ఆమె వుబుకు రొమ్ములమీద విహరిస్తున్నాయి. ఆ తెల్లని తడిచీర ఆమె పిరుదుల్ని అంటిపెట్టుకుని యెంత పెత్తనం చెలాయిస్తుం దంటారు? ఆదృశ్యాన్ని చూసేసరికి నా నియమాలు, కట్టుబొట్లూ అన్ని మర్చిపోయి, శరీరాన్ని వేడెక్కించుకున్నాను.

"మరి వొస్తారా?" అంది కిన్నెర కంఠంతో. నేను మాట్లాడకుండానే ఆమోహిని అడుగులో అడుగులు వేసుకుంటూ నడిచాను.

★

ఉదయం ఆఫీసులో ఆవెధవ కాయితాలు చూడ్డం యెప్పుడైపోతుందా అనిపించింది. యేలాగో పని పూర్తిచేసుకుని పక్కమీద మేనువాల్చేను- వుష్క

కాలపువింత దృశ్యాన్ని తల్చుకుంటాను. నా కాశ్మీర కాలువ యెంత పుణ్యంచేసుకుంది! యెన్ని రాళ్ళకీ, యెన్ని దేవుళ్ళకీ, దేవతలకీ, మొక్కి తెచ్చుకున్న పుణ్యమో అది!! ఆమె పవిత్రావయవాల స్పర్శ యెంత కూరిగ్గా అనుభవించింది! నా కసితీరా ఆ కాలువని గట్టిగా కవలించుకున్నా. కాని, యేమిటో నా హృదయంలో మహోజ్వలమైన తాపం బయలుదేరింది-నా శరీరాన్నంతనీ రేపిలాగేస్తోంది, యేదో నాకు తెలీని వొక వొస్తువ.

★

మరుచటి దినం ఆమె గుమ్మందగ్గర కనిపించలేదు. చక్కగా అలికి ముగ్గేసివుంది. ఆమె నీటికోసం వెళ్లి వుండాలని కాస్త అడుగులు చురుగా వేశాను. ఆమె వొడ్డున కూచుని బిందె తోముతోంది. ఆమెకి తెలీకండా వెనకాలే వెళ్లి కళ్ళు మూయాలనుకున్నా కాని, ఆమె సమీపంలోకి వెళ్లేసరికి నీటిలో నా నీడ ఆనింది. ఆమె మెడతిప్పి ఆ కలువరేకుల కన్నుల్తో వొక్కమారు చూచింది అంటె! నా శరీరమప్పుడే నా స్వాధీనం తప్పిపోతోంది.

"వొచ్చారూ! యేమా యీ వేళ ఆలస్యమైందని ఆలోచిస్తున్నాను" అంది, మళ్లి బిందెతోమటం ప్రారంభిస్తూను.

"నే రావడమా? మామ్మూలు వేళకంటే యీ వేళేకాస్త నాల్గు నిమిషాలు ముందుగానే వొచ్చానే. అయితే వొకటి లెండి నిన్న పొగమంచు చాలా జాస్తీగావుంది అందుచేత యెంత వేళ అయిందీకూడా తెలీలేదు" అన్నాను, సామాను సర్దుకుంటూను. ఆమె బిందె కడగాలని నదిలోకి దిగుతూ "నిన్న యీలాగేసుమండీ దిగాను. వెధవ నాచుమీద కాలు జారి పోయింది. చట్టుమని మీరు సమీపంలోనే వున్నారు గనుక .. సహాయపడ్డారు. సహాయపడ్డం యేమిటి ప్రాణం నిలబెట్టారు. లేకపోతే యీపాటికి యెక్కడుందునో!" అంది ముఖం నావేపు అదోలాపెట్టి.

"అదేమిటి అయితే మీ అమూల్యమైన పరిచయం దొరికేదా?" "బాగా జెప్పారు. రాత్రి అంతా యీ విచిత్రసంఘటన గురించే ఆలోచించాను.

యీ ప్రపంచంలో యెన్నో నాటకాలు జరుగుతూంటాయి సుమండీ" ఆమె బిందినిండా నీళ్ళు ముంచుకుని వొడ్డుకొచ్చి నిలబడింది. ఆమెతో మాట్లాడాలని పెదవులు కదల్చలేను. యేమిటీ అవస్థంతాను? "మీ రుణంతీర్చుకో లేనండీ" అంది బిందె చంకకి తదిలించుకుంటాను. "ఆ మీరు సురక్షితంగా వున్నారు నా కదేచాలు" అన్నాను, యేదో నోటికి వొచ్చినట్టూ. ఆమె నవ్వుతూ పైట సర్దుకుంటూ మంద గమనం సాగిస్తోంది. ఆమె పాదాలమీద కుచ్చిళ్లు నృత్యం జేస్తున్నాయి. నేను యీదుతో మంటూ నదిలోకి వురికాను.

★

యీ విశాల ప్రపంచమంతా వొక నాటకం. అంతా తమాషా 'అంతా విచిత్రం! నిన్న మొన్నటి వరకూ యీ చెట్లన్నీ ఆకులాలి యీ బీళ్లన్నీ కళా విహీనమయ్యాయి. కొద్ది రోజుల్లోనే అవి చిగిర్చి, పల్లవించి యెంతో ఆకర్ష వంతంగా తయారయ్యాయి. మానవ జీవితం కూడా అంతే. యీ యౌవ్వన కాలంలోనే మనం సంతోషాన్నీ, ఆనందాన్నీ తనివితీరా అనుభవించాలి; అంతే నా కోరిక.

"యిట్లా యెంతకాలం వొస్తావు?" "యిట్లా నీవెంతకాలం వొచ్చి, ఆనందపర్చి వెళ్తావు? అంతకాలం యిలా వొస్తూనే వుంటాను వెళ్తూనే వుంటాను."

"యెందుకో వృథా ప్రయాస? లేచిపోదాంరా. యీ ప్రదేశంలోంచి. హాయిగా యిద్దరం కలిసి అనుభవిద్దాం."

"రాను. రాను. యెందుకు రావాలి?"

"మనకోసం, మన ఆనందం కోసం; తప్పా. నీకోసమే, నీ ఆనంద కోసమే" అదికాదు నే అనేది యెంతకాల మిలా యీ రహస్యానందం?"

"నువ్వుచాలా పొరపడుతూన్నావు. వీరపురుష సహజమైన స్వార్థాన్ని వెలిగక్కవు. అంతే గాని యిదిరహస్యమా? కొన్ని మైళ్లు ఆనందంలో వురకవేసుకుం... వొస్తుంటేను పోనీ నీవన్నట్టు లేచిపోదాం. అక్కడ మాత్ర మేమంత ప్రత్యేకానందంవుంది?"

"లేకేం ..బోలెడంత లేకేం?"

"ఏంవుంది. నన్ను మందిరంలో బెట్టి తాళంవేసి నీవు నీ యిష్టంవొచ్చినట్టు వుపయోగించుకుంటావు. అప్పుడు నీవు నామీద అధికారివై పోతావు. నీవు చెప్పినట్టు నా అడుగులకి మడుగులొత్తుతూ వుండాలి" "నామీద అధికారం చెలాయించాలని కాదు. నిన్ను నా హృదయ దేవాలయంలో ప్రతిష్ఠించుకుని పూజించడానికే."

"కాదు యిప్పుడు నీవామాట అంటున్నావుకాని అతి పరిచయంవల్ల నామీద నీవు సర్వాధికారివై అక్కడనుండి మన జీవితంలో ఆ ఆనందమనేది దూరమై యిసుకలో, కసురులో ప్రారంభమైన యిరువురి జీవితాలుకూడా అధోగతి పాలైపోతాయి. యిట్లా యీ సమావేశమే మన యిరువురికీ కూడా ఆనందమైంది. మన జీవితనౌకని సౌఖ్యంగా నడిపేది. మన యిరువురికీకూడా బాధ్యతా, అధికారంలేకండా, పసుగుదలలేకండా కాలం జరుగుతుంది."

"నన్ను ప్రేమిస్తున్నావా?"

"నిష్కలంక హృదయంతో, పవిత్రంగా" ఆమె దప్పున నాజుభుజాలమీద చేతులానించి నా చెంపలమీద చేతులువేసి లాక్కుంది; అంతే!

★

వొద్దు. నే రాను. నన్ను బలవంతంచేయకు నీ మాటకి యెదురాడలేదు. నీ యెదటకి వొచ్చేసరికి నా సర్వేంద్రియాలూ నా స్వాధీనమై పోతాయి అలాంటప్పుడు నీ కోర్కెని కాదనలేక లోబడి పోతాను. తరువాత మన జీవితాలు అధోగతి పాలై పోతాయి"

"మరేం ఫరవాలేదు."

"నన్ను మందిరంలోకి తీసుకుపోయి పంజరకీరాన్ని చేసేయకు. మన యిరువురి బతుకు తెరువులో చూచే నా అభిప్రాయాన్ని తెలుపుతూన్నాను"

ఆమె చప్పున నా వొడిలోంచి లేచేసి "యిట్లా చూడు. నీ చేయియిలాయియ్యి. నీ మీద నాకెంత ప్రేముందీ" అంటూ ఆమె పైట వో తిగించి ఆమె గుండెలమీద నా చేయేసి "ఆ- యిప్పటికైనా నీ పిరి అనుమానంతీరిందా? పిచ్చావాడా. నీకంటే నాకీవిశాల ప్రపంచంలో మరెవ్వరున్నారు?! యెందుకో నాచేతులు అప్రయత్నంగా ఆమె మీదకి వెళ్ళాయి. అరటిబొంత లాంటి ఆమె శరీరమంతా నా రెండు చేతుల్లోనూ యిమిడిపోయింది. ఆకాశంమీద చుక్కల్ని లెక్కిస్తూ ఆమె అలాగే వుండిపోయింది. చల్లని చంద్రుడు వేపచెట్టు కొమ్మల్లోంచి తొంగితొంగి చూస్తూన్నాడు. నది యీ ప్రపంచంతో, యీచేపల్లో నాకేం సంబంధం అంటూ నెమ్మట్టు ప్రవహిస్తూంది. ఆమె ఆనందం పరవశయై, అర్ధ నిమీలిత నేత్రాలతో!

